స్నేహితుడి కుటుంబానికి చేయూత

ఘట్‌కేసర్: అనారోగ్యంతో మృతిచెందిన బాల్యమిత్రుడి కుటుంబానికి జెడ్పీ ఏదులాబాద్ స్కూల్ 1996–97 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆర్థికసాయం చేశారు. ఏదులాబాద్‌కు చెందిన విజయ్ అనారోగ్యంతో మృతి చెందగా.. గ్రామంలో ఆదివారం నిర్వహించిన దశదినకర్మకు హాజరైన స్నేహితుడికి నివాళులర్పించారు. అనంతరం రూ. 50 వేలు కుటుంబసభ్యులకు అందజేశారు.

వారాంతపు సంతలు

మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలో ప్రతీ వారం కూరగాయాలు, ఇతర సామగ్రి విక్రయించే వారంతపు సంతల సమాచారం ఈ విధంగా ఉన్నాయి. సోమవారం రైల్వేస్టేషన్ రోడ్డు (పోలీస్ క్వార్టర్స్ రోడ్డు), అత్వెల్లి, రాఘవేంద్రనగర్ కాలనీ, మంగళవారం ఉమానగర్, కేఎల్ఆర్ విజయానగర్, బుధవారం ఎన్జీఓస్ కాలనీ (మేడ్చల్), గురువారం వీకర్ సెక్షన్ కాలనీ(జెడ్పీహెచ్ఎస్ స్కూల్ వద్ద), శుక్రవారం సూర్యనగర్, చంద్రానగర్, శనివారం హౌజింగ్‌బోర్డు కాలనీ, కిష్టాపూర్, చెక్‌పోస్టు, ఆర్టీసీ కాలనీ, ఆదివారం ప్రధాన మార్కెట్‌లో ఉంటుంది.

పలహారం బండి ఊరేగింపు



కుందన్‌పల్లి ఊరేగింపులో పాల్గొన్న వజ్రేష్‌యాదవ్

కీసర: నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల పరిధిలో బోనాల ఉత్సవాల సందర్భంగా ఆదివారం రాత్రి వివిధ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన పలహార బండ్ల ఊరేగింపులో కాంగ్రెస్‌పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్‌యాదవ్ పాల్గొన్నారు. నాగారం, దమ్మాయిగూడ మున్సిపల్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ముప్పురామారావు, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్లు నరేందర్‌రెడ్డి, మల్లేష్‌యాదవ్, నేతలు కృష్ణయాదవ్, ప్రవీణ్, కిరణ్‌జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కీసర: కుటుంబకలహాలతో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన కీసర పోలీస్‌స్టేషన్ పరిధి నాగారంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మంచిర్యాల మందమర్రికి చెందిన వేణుగోపాల్ (40) భార్య హారికతో కలిసి 2 నెలల క్రితం నాగారంలోని సత్యనారాయణ కాలనీకి వలసవచ్చాడు. వీరికి రెండేళ్ల కుమార్తె సంతానం. కాగా భార్యాభర్తల మధ్య గొడవల కారణంగా ఈనెల 17న భర్త పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి చేరుకున్నారు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



నాగారంలో బోనాల ఉత్సవాల్లో ఎమ్మెల్యే మల్లారెడ్డి



బోనంతో మాజీ మేయర్ కావ్య, ఎమ్మెల్యే



చెన్నాపురంలో..

బోనం వైభవం !

మేడ్చల్‌లో ఘనంగా బోనాల పండుగ

మేడ్చల్‌జోన్ పరిధిలో బోనాలు వైభవంగా జరిగాయి. ఆదివారం మహిళలు బోనాలను సిద్ధం చేసుకుని అమ్మవారికి సమర్పించారు. సంప్రదాయబద్ధంగా తమ ఇళ్ల నుంచి ఆలయాల వరకు ఊరేగింపుగా పోతరాజుల నృత్యాలు, శివసత్తులతో బోనాల పండగ శోభాయమానంగా నిర్వహించారు. ఆలయాల వద్ద నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేశారు. అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అన్ని రాజకీయ పార్టీల ప్రముఖులు బోనాల ఉత్సవాల్లో పాల్గొని సందడి చేశారు.

– మేడ్చల్ జోన్ బృందం.



బోనం సమర్పించేందుకు వెళ్తున్న మహిళలు



మహంకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన డీసీపీ పద్మజ



ఎన్ఎఫ్‌సీనగర్‌లో..



చీర్యాలలో మాజీ ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ తదితరులు

సూర్య యూత్ అసోసియేషన్ నూతన కమిటీ



పోచారం: అన్నోజిగూడలోని యాదాద్రి పార్కు వద్ద ఆదివారం నిర్వహించిన సూర్య యూత్ అసోసియేషన్ సమావేశంలో నూతన కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. సూర్య యూత్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రాజేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా బొక్క వినయ్‌రెడ్డి, గాంధారి ప్రశాంత్, ప్రధాన కార్యదర్శిగా యంజాల శివగౌడ్, కోశాధికారిగా భవానీశంకర్‌యాదవ్, సెక్రటరీలుగా ప్రదీప్, రఘురాంరెడ్డి, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులుగా వినోద్, శివారెడ్డి, మణికిశోర్, ఈశ్వర్, పవన్, సోషల్ మీడియా కన్వీనర్లుగా విశ్వముది రాజ్, వినయ్‌శర్మ, అవినాష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మాజీ మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ రెడ్డియానాయక్, నాయకులు శేఖర్‌ముదిరాజ్, సత్తిరెడ్డి, భాస్కర్‌గౌడ్, కేఎంరెడ్డి, అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు శరత్‌ముదిరాజ్, మాజీ ప్రధాన కార్యదర్శి లోకేష్ తదితరులున్నారు.

అట్టడుగు వర్గాలు ఒకే తాటిపైకి రావాలి



ఘట్‌కేసర్: కారంచేడు ఘటన పునరావృతం కాకుండా అట్టడుగు వర్గాలు ఒకే తాటిపైకి రావాలని ఘట్‌కేసర్ అంబేడ్కర్ యువజన సంఘం సభ్యుడు నారాయణ అన్నారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్రబుద్ధ భారత్ బాధ్యుడు అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల సమర్పించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అలనాటి మరణకాండలో మరణించిన అమరుల పోరాట పటిమను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. నర్సింగ్‌రావు, బాలయ్య, రాందాసు, రాజేష్‌కుమార్, అంజయ్య, గణేష్‌గౌడ్, కృష్ణంరాజు, లలిత్ పాల్గొన్నారు.

మల్కాజిగిరిలో ఫ్లాగ్ మార్చ్



మల్కాజిగిరి: బోనాల జాతర సందర్భంగా మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం సాయంత్రం పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. డీసీపీ పద్మజారెడ్డి ఏసీపీ చక్రపాణి, ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణతో పాటు ఇతర సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇటీవల జరిగిన రాజకీయ పరిమాణాల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని, ఫలహారం బండ్ల ఊరేగింపులో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సమయపాలన పాటించేలా చూడాలన్నారు. గాంధీ పార్కు నుంచి ఓల్డ్ మల్కాజిగిరి, మల్కాజిగిరి చౌరస్తా, మీర్జాలగూడ వరకు ఫ్లాగ్‌మార్చ్ జరిగింది.



సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీసీపీ పద్మజ

లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన కమిషనర్



కుత్బుల్లాపూర్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొంపల్లి మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి ఆదివారం ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. ముఖ్యంగా జయభేరి కాలనీలో రోడ్డుపై చేరిన నీరు పలు ఇళ్లల్లోకి వెళ్తుండగా.. మరికొన్ని ప్రాంతాల్లో సెల్లార్‌లోకి వర్షపు నీరు వెళ్లినట్లు గుర్తించారు. రాబోయే రోజుల్లో వర్షం నీరు నిల్వకుండా శాశ్వత పరిష్కారం చూపే విధంగా ప్రణాళికలు రూపొందిస్తామని తెలిపారు.

స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి



మల్లాపూర్: బస్తీబాట కార్యక్రమంలో భాగంగా ఆదివారం మల్లాపూర్ డివిజన్ పరిధిలోని గ్రీన్ హిల్స్ కాలనీలో గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నేత నెమలి అనిల్‌కుమార్ పర్యటించారు. వర్షం వస్తే చాలు వరద నీటితో గ్రీన్‌హిల్స్ కాలనీ జలమయమవుతుందన్నారు. సీసీరోడ్లు, వీధిలైట్లు వంటి సమస్యలు ఉన్నాయని స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. గ్రీన్‌హిల్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కొత్త మల్లారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రంగారెడ్డి, సలహాదారులు సర్వేశ్వరరావు, సత్తయ్య, గోవర్ధన్‌రెడ్డి, మోసిన్ అల్తాఫ్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

ఘట్‌కేసర్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని బాలాజీనగర్‌లో ఓ వ్యక్తి అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్నాడన్న సమాచారం మేరకు తుల్పునారి జైహింద్‌గౌడ్ (51) ఇంటిని పోలీసులు తనిఖీ చేశారు. తనిఖీల్లో 66 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల విచారణలో వైన్స్ నుంచి మద్యం కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు తేలింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం

అల్వాల్: వ్యక్తి అదృశ్యమైన ఘటన నేరెడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్ సఫిల్‌గూడ గణేష్‌నగర్‌లో నివసించే దూదేకుల మస్తాన్ (62)కు మతిస్థిమితం సరిగ్గా లేదు. ఆదివారం ఉదయం మార్నింగ్ వాక్‌కు ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. తెలిసిన చోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

22న నూతన రేషన్‌కార్డుల పంపిణీ

మేడ్చల్: నూతనంగా మంజూరైన రేషన్‌కార్డులను ఈనెల 22న పంపిణీ చేస్తున్నట్లు తహసీల్దార్ భూపాల్ తెలిపారు. అత్వెల్లిలోని జీఎస్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ప్రభుత్వ విప్ మహేందర్‌రెడ్డి హాజరై లబ్ధిదారులకు నూతన రేషన్‌కార్డులను అందజేస్తామని తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ఉప్పల్: వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ భరత్‌నగర్ కాలనీకి చెందిన గుమ్మడివెల్లి శ్రీనివాస్(51)ఆర్టీసీలో కాండక్టర్‌గా పనిచేస్తున్నాడు. కాగా ఉప్పల్ బీరప్పగడ్డ ఎస్సీ కమ్యూనిటీహాల్‌లో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాధుల కాలం.. అప్రమత్తతే కీలకం

- ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల కొరత లేకుండా కసరత్తు
- పారిశుద్ధ్యంపై అధికార యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ
- వారానికోసారి డ్రైడే పాటించేలా ప్రజల్లో అవగాహన
- క్షేత్ర స్థాయి పర్యవేక్షణపై కలెక్టర్ మను చౌదరి నజర్



సాక్షి,మేడ్చల్ జిల్లా: వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా జిల్లా వైద్యారోగ్యశాఖ, పురపాలక సంఘాల అధికారులు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టారు. మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో డెంగీ కేసులు ఇబ్బడిముబ్బడిగా నమోదవుతున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమవుతోంది.

కలెక్టర్ సమీక్ష..

అంటువ్యాధులు, డెంగీ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ మను చౌదరి సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ.. అమలు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే కలెక్టర్ ప్రభుత్వ పాఠశాలలు, జ్యోతిరావుపూలే, రెసిడెన్షియల్ స్కూళ్లకు తనిఖీలు చేపట్టి పలు చర్యలకు ఉపక్రమించారు.

- దవాఖానాలు, పీహెచ్‌సీలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పురపాలక సంఘాలను క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించి, వాటిని లక్ష్యానికి తగినట్లుగా చక్కబెట్టాలన్న యోచనతో కార్యాచరణకు సిద్ధమవుతున్నారు. పురపాలక సంఘాల్లో 100 రోజుల కార్యాచరణ కొనసాగుతోంది. వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటున్నారు.

ఆసుపత్రుల్లో మందుల కొరత లేకుండా..

- వర్షాకాలంలో ప్రధానంగా జలుబు, దగ్గు, జ్వరం వంటివి అధికంగా సోకుతాయి. రోగులు చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రులకు వస్తే మందులు అందుబాటులో ఉండేలా అధికార యంత్రాంగం తగిన జాగ్రత్తలు తీసుకుంటోంది.

పట్టణాలు, బస్తీలపై ప్రత్యేక దృష్టి

- పట్టణాలు, బస్తీల ప్రజలకు వైద్యసేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయి. ఇలాంటి వాటిని గుర్తించిన వైద్యాధికారులు అక్కడి ప్రజలకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటున్నారు.
- అధిక వర్షాల కారణంగా గర్భిణులు ప్రసవ సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటారు. వైద్యుల సూచనల మేరకు వారిని ముందస్తుగా ఆసుపత్రుల్లో చేరాలని సూచిస్తున్నారు.

పారిశుద్ధ్యంపై..

- వర్షాకాలంలో మురుగునీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా మారుతోంది. చిన్నపాటి వర్షాలకే కొన్ని పురపాలక సంఘాల్లోని పలు కాలనీలు, వీధులు చెరువులను తలపిస్తున్నాయి. మురుగు, వ్యర్థాలు ఇళ్లల్లోకి చేరడంతో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. వర్షాకాలం ముగిసేంత వరకు బస్తీలు, కాలనీలు, పట్టణాల్లో పారిశుద్ధ్యం, మురుగునీటి నిర్వహణపై దృష్టి సారించాలని జిల్లా అధికార యంత్రాంగం సూచిస్తోంది.

వారంలో ఒకరోజు..

వర్షాకాలంలో నీరు నిల్వ ఉండటంతో దోమలు వృద్ధి చెంది అనేక రోగాలకు కారణమవుతాయి. దోమల వ్యాప్తిని అరికట్టేందుకు వారంలో ఓ రోజు(శుక్రవారం) డ్రైడే పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. ఇంటింటికీ వార్డు అధికారి, ఆశాకార్యకర్త, అంగన్‌వాడీ టీచర్, పారిశుద్ధ్య సిబ్బంది వెళ్లి నీటి నిల్వ వల్ల దోమలు వృద్ధి చెందుతాయనే అంశంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలి. వేడి పదార్థాలను తీసుకోవాలి. నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు తీసుకోకూడదు. బయటి తినుబండరాలకు దూరంగా ఉండాలి.
- కాచీ చల్లార్చిన నీటిని మాత్రమే తాగడం మంచిది. చేతులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి.
- ఓవర్‌హెడ్ ట్యాంకులు, నీటిసంపులు, నీటి పాత్రలపై నిరంతరం మూతలు ఉంచాలి. వారానికోసారి నీరు నిల్వ ఉన్న పాత్రలు, డ్రమ్ములను ఖాళీ చేసి శుభ్రపరచుకోవాలి.



ట్రెండ్ మారింది!

- సీసా నుంచి ప్యాకెట్ వరకు కల్లు వ్యాపారం
- ఈజీగా ట్రాన్స్‌పోర్ట్.. యథేచ్ఛగా సరఫరా



ప్యాకెట్లలో ఉంచిన కల్లు



సంచుల్లో ప్యాక్ చేసిన కల్లు ప్యాకెట్లు

మేడ్చల్: కర్షక కార్మికుడి అలసట తీర్చి హాయిగా 4 గంటల పాటు నిద్రపోయేందుకు ఉపయోగపడే కల్లును వ్యాపారులు ట్రెండ్‌కు అనుగుణంగా మారుస్తున్నారు. ప్లాస్టిక్ కవర్లలో అందంగా ప్యాక్ చేసి హాయిగా వ్యాపారం సాగిస్తున్నారు. కల్తీ, మందుల కల్లును సులువుగా ప్యాకింగ్ చేసి డిపో నుంచి గ్రామాల్లోని రిటైల్ దుకాణాలకు సరఫరా చేస్తూ.. కల్లు వ్యాపారాన్ని సాగిస్తున్నారు.

ప్రతీ గ్రామంలో కల్లు దుకాణం..

నగర శివార్లలో ప్రతి గ్రామంలో కల్లు దుకాణం ఉంటుంది. లైసెన్సులు, లైసెన్సులు లేని బ్లాక్ అడ్డాలు ఉండటం సహజంగా కనిపిస్తుంటాయి. రాష్ట్రంలోని గౌడ సమాజం వారి వృత్తి కల్లు వ్యాపారం కావడంతో వారికే ప్రభుత్వం కల్లు అమ్మడం, కల్లు గీయడం కేటాయించింది. ఈ వృత్తి ద్వారానే వేల గౌడ కుటుంబాలు జీవనం సాగిస్తున్నారు. గ్రామానికి 2–3 లైసెన్సులు ఎక్సైజ్‌శాఖ కేటాయిస్తుంది. ఎక్సైజ్ శాఖ కేటాయించిన లైసెన్సులపై దుకాణాలు (మామ్‌లా) సాగుతున్నాయి.

రూరల్, అర్బన్‌లో వేర్వేరుగా...

గ్రామీణ ప్రాంతాల్లో గీత కార్మికులు గ్రామంలోని ఈత, తాటి చెట్లను ఎవరికి వారు పంచుకుని ఆ చెట్లతో వచ్చే కల్లును గీసుకుని వారే ఇంటివద్ద, లేదా కేటాయించిన పాయింట్ల వద్ద విక్రయాలు చేసుకుంటూ జీవనాలు సాగిస్తున్నారు. అర్బన్‌లో మాత్రం పరిస్థితి మరోలా ఉంటుంది. నగరం, నగర శివార్లు కాంక్రిట్ జంగిల్‌గా మారడంతో కల్లు అందించే తాటి, ఈతచెట్లు తక్కువగా ఉంటాయి. దీంతో నగర శివార్లలో కల్లు దుకాణాలు ఎక్కువగా ఉంటాయి. స్థానికంగా లభ్యమయ్యే కల్లుతో పాటు, గ్రామీణ ప్రాంతాల నుంచి కల్లు తీసుకొచ్చి 10 గ్రామాలకు సరిపడేలా ఒకచోట డిపో ఏర్పాటు చేసి అక్కడి నుంచి గ్రామాల్లోని కల్లు కాంపౌండ్‌లకు సరఫరా చేసి సీసా రూ.20 నుంచి 50 వరకు విక్రయిస్తున్నారు.

కోట్లలో దందా...

కల్లు వ్యాపారాం నేడు కోట్ల రూపాయాలకు చేరింది. గ్రామాల్లో ఉండే గౌడ కులస్థులు అందరూ కలిసి గౌడ సంఘంలో సభ్యులు కావడంతో అందరికి కల్లు వ్యాపారం లో హక్కు ఉంటుంది. అందరూ కల్లు వ్యాపారం చేసే పరిస్థితి లేకపోవడంతో కొందరి చేతిలో కల్లు వ్యాపారం ఉండిపోతుంది. దసరా నుండి దసరా వరకు కల్లు వ్యాపారులకు సంవత్సరంగా ఉంటుంది. గ్రామంలో కల్లు దుకాణం నిర్వహించేందుకు సంఘం వారు వ్యాపారులకు వేలం పాట నిర్వహిస్తున్నారు.బహిరంగ వేలం కావడంతో కల్లు వ్యాపారం చేసే వారు కోట్లలో పాటలు పాడి వ్యాపారంను దక్కించుకుంటున్నారు.

4–5 గ్రామాలకు యూనిట్..

నాలుగైదు గ్రామాల కల్లు దుకాణాలను ఒకే వ్యాపారి వేలంలో దక్కించుకుని వ్యాపారం చేస్తున్నారు. దీంతో వ్యాపారులు తమ ఆధీనంలో ఉండే కల్లు దుకాణాల్లో కల్లు కోసం ఒక దగ్గర డిపో ఏర్పాటు చేసి అక్కడి నుంచి దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే కల్లు , రుచి కోసం కలిపే కెమికల్స్, చక్కెర, ఉప్పు ఇలా అన్ని ఒక పెద్ద డ్రమ్ములో కలిపి అక్కడి నుండి దుకాణాలకు చేరవేస్తున్నారు.

సీసా నుంచి ప్యాకెట్ వరకు..

గతంలో కల్లు దుకాణాల్లో కల్లును సీసాలో నింపి సీసాకు రేటు చొప్పున విక్రయించే వారు. సీసాలను పెట్టెలో ఉంచి పెట్టల చొప్పున లెక్క చూసి డిపో నుంచి రిటైల్ దుకాణాల వరకు చేరవేర్చి విక్రయాలు చేసేవారు. రిటైల్ అమ్మకాలు చేసే వారు, డిపో వారు విడివిడిగా వ్యాపారాలు చేస్తున్నారు. తాజాగా కల్లు డిపోలు నిర్వహిస్తున్న వ్యాపారులు కల్లు సీసాలకు స్వస్తి పలికి ప్యాకెట్లలో కల్లును ప్యాక్‌చేసి విక్రయిస్తున్నారు. కోలతల్లో సీసాను ప్రామాణికంగా తీసుకుని ఒక సీసా ప్యాకెట్, రెండు సీసాల ప్యాకెట్, 5 సీసాల ప్యాకెట్ తయారు చేసి వాటిని దుకాణాలకు పంపుతున్నారు.

ఆకర్షణీయంగా ప్యాకింగ్..

కల్లును ప్యాకెట్‌లో ప్యాకింగ్ చేసేందుకు వ్యాపారులు ఏ మాత్రం వెనకడుగు వేయడం లేదు. పాలప్యాకెట్ కన్నా మందం, పటిష్టంగా, తయారు చేస్తున్నారు. కల్లు డిపోలో ప్యాకింగ్ యూనిట్ ఏర్పాటు చేసి వాటిపై తమ వ్యాపార సంస్థల పేరు, బ్రాండ్ ముద్రించి అందులో కల్లు నింపి ప్యాకెట్లు తయారు చేస్తున్నారు.

ఎవరికీ తెలియని అయోమయ పరిస్థితి

ప్యాకింగ్‌లో ఉన్న కల్లు కల్తీదా.. మంచిదా.. అని తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. కల్లు ప్యాక్ చేసిన వారికి సైతం తెలియకుండా ఉండటంతో వ్యాపారుల కల్తీ వ్యాపారం జోరుగా సాగుతోంది.

ఎక్కడ పడితే అక్కడ విక్రయం..

గతంలో ఎక్సైజ్ శాఖ లైసెన్సులు ఇచ్చిన వారు మాత్రమే కల్లును విక్రయించే వారు. తాజాగా కల్లు నిల్వ ఉంచడం, ప్యాకెట్లలో ఉంచడం మారడంతో విక్రయాలు సులువుగా మారాయి. బెల్ట్‌షాపులు, ఇతర షాపుల వద్ద కల్లుప్యాకెట్లు నిల్వఉంచి అక్రమ వ్యాపారం హాయిగా చేస్తున్నారు. కల్లు ప్రియులకు ఎక్కడ పడితే అక్కడ కల్లు సులువుగా లభిస్తుండటంతో వ్యాపారం అధికమవుతుండటంతో కల్లు వ్యాపారులు ప్యాకింగ్ కల్లుపై ఆసక్తి చూపుతున్నారు. మొత్తం మీద గ్రామీణ ప్రాంతాల్లో అందరికీ అందే పానీయం నేడు సీసా నుంచి ప్యాకెట్‌లోకి చేరింది.

కల్తీ లేకుండా విక్రయించేలా చూస్తున్నాం..

ఎక్సైజ్ శాఖ నిర్దేశించిన ప్రాంతాలు, లైసెన్సులు ఉన్న వారు స్వచ్ఛమైన కల్లు విక్రయిస్తున్నారా.. లేదా వంటి విషయాలను ఎక్సైజ్‌శాఖ చూస్తుంది. కల్లు శుభ్రమైన ప్రాంతంలో ఉంచారా.. వంటి విషయాలను చూస్తున్నాం. సీసాలు, గ్లాసులు, ప్యాకెట్లలో విక్రయిస్తున్నారా.. అనే విషయం కంటే కల్తీ లేకుండా కల్లు విక్రయిస్తున్నారనే విషయం పైనే దృష్టి సారిస్తున్నాం. నిబంధనలకు విరుద్ధంగా ఉంటే కేసులు నమోదు చేస్తాం.

– నవనీత, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మేడ్చల్